క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనగలూరు : మండలంలోని సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ నేడు నిలిపివేయనున్నట్లు ఏఈ షఫీ తెలిపారు. పెనగలూరు, బెస్తపల్లె, కొండూరు, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట మండల పరిధిలోని 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. రాజంపేట మండలంలోని ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, మందరం పుల్లంపేట మండలంలోని వత్తలూరు పెనగలూరు మండలంలోని పెనగలూరు, కొండూరు, టి.జి.పల్లి, బెస్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : కొర్లకుంట సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33కేవీ విద్యుత్ లైన్ పరిశీలనకై విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు.

20న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

రామాపురం : మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈనెల 20వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

గాలివీడు : నర్సరీ యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సులు పొందాలని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నర్సరీలను తనిఖీ చేశారు. మాట్లాడుతూ లైసెన్సులు పొందిన నర్సరీ యజమానులు మాత్రమే విక్రయాలు చేయాలని, అంతేగాక విత్తన నిల్వ రికార్డులు, అమ్మకాల రికార్డులు, సస్యరక్షణ రికార్డులు తనిఖీ చేసే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు నాణ్యమైన నారు ఇవ్వాలని, నారుకు సంబంధించిన రశీదులను కూడా ఇవ్వాలని తెలియజేశారు. ఆమె వెంట ఉద్యానశాఖ సిబ్బంది మల్లిక ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఒంటిమిట్ట విద్యార్థిని


ఎ.ఆర్తి

ఒంటిమిట్ట: మండల పరిధిలోని కొత్తమాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎ.ఆర్తి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు కొత్త మాధవరం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. కొత్తమాధవరం గ్రామ పంచాయతీ మల్లేశ్వరపురానికి చెందిన గద్దె శివలింగం, సుశీలల కుమార్తె. దీంతో విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

పోటీ పరీక్షలకు పునాది వేయాలి

రాజంపేట రూరల్ : విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రథమ సంవత్సరంలోనే పునాదులు వేసుకోవాలని తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఫార్మసీ విభాగపు హెచ్ఓడీ జీకే నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీకే నాయుడు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పలు రకాల మందుల తయారీ విధానాలను వివరించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటమే మహాభాగ్యమని వాకర్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ రీజనల్ కౌన్సిలర్ కె.శరత్‌కుమార్‌రాజు అభిప్రాయపడ్డారు. స్థానిక బీవీఎన్ హైస్కూల్‌లో వాకర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్ సయ్యద్ అబ్దుల్ రెహమాన్ జ్ఞాపకార్థం న్యాయవాది ఎస్.నసిరుద్దీన్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి హస్పిటల్, వాసన్ ఐకేర్ నుంచి విచ్చేసిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. శిబిరంలో పాల్గొన్న అసోషియేస్ ఫాస్ట్ ఏరియా వైడర్ ప్రెసిడెంట్ కె.రవిరాజు రూ.లక్ష విలువ చేసే మందులను పంపిణీ చేశారు. కె.సుబ్బరామరాజు, టి.పెంచలయ్య, ఎ.వెంకటయ్య, రామచంద్రరాజు, ఎంజీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయచోటిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- కొత్తపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- పారిశుధ్యం మరింత మెరుగుకు చర్యలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న గడికోట


మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : అభివృద్ధిలో రాయచోటి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపేటలో 20, 21 వార్డులలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ తదితరులతో కలసి పాల్గొన్నారు. డిష్ రెడ్డెన్నవీధి, సాయిరాంవీధి, నెహ్రూ నగర్, టెంకాయ చెట్ల వీధి, నేషనల్ హైస్కూల్ వీధి, ప్రశాంత్ నగర్‌లలో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కష్టనష్టాలను తెలుసుకున్నారు. కొత్తపేట అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాగా కొత్తపేట వీధులలో విస్తృతంగా పర్యటించిన గడికోటకు గడప గడపలోను విశేష ఆదరణ లభించింది. మహిళలు కర్పూర హారతులతో, నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువలు, గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.

జిల్లా కేంద్రం ఏర్పాటుతో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు

జిల్లా కేంద్రం ఏర్పాటుతో రాయచోటి పట్టణం అభివృద్ధి చెందడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా లభిస్తున్నట్లు పలువురు శ్రీకాంత్ రెడ్డితో అన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుకు మీకృషి అభినందనీయమంటూ శ్రీకాంత్‌రెడ్డిని ప్రశంసించారు.

కార్యక్రమంలో మండల బీసీ నేత పల్లపు రమేష్, కౌన్సిలర్లు కసిరెడ్డి వెంకటనరసింహారెడ్డి, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కొలిమి చాన్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ నేతలు జయరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, జానం రవీంద్ర, సుగవాసి శ్యామ్‌కుమార్, పల్లా రమేష్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, అమరనాథరెడ్డి, అనిల్‌రెడ్డి, గంగిరెడ్డి, మాధవరం రమేష్‌రెడ్డి,డీలర్ నాగేంద్ర, దిన్నెపాడు రవిరాజు, వై.బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, మనోజ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి, నరేష్, హజరత్ ఖాదర్‌వలీ, పాదలపల్లె గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కమ్మపాలెంలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

సిద్దవటం : గ్రామాలలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా, కొళాయిలు లీకేజ్ కాకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా చికెన్‌గున్యా, డెంగ్యూ, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు వస్తాయని తెలియజేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పనికిరాని పడేసిన తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, మొదలగు వాటిలో వర్షం నీరు నిల్వ ఉండి లార్వా ఉత్పత్తి చెందుతుందని అలాంటి వస్తువులను ఇంటికి దూరంగా పడేయాలన్నారు. రాత్రి పూట ప్రతి ఒక్కరూ నిండు దుస్తులు వాడాలని, దోమ తెరలను వాడాలన్నారు. అనంతరం అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశామన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి లోకేశ్వరి, సీనియర్ ఆరోగ్య కార్యకర్త లక్షుమ్మ, జెడ్పీ హైస్కూల్ హెచ్.ఎం. శ్రీరాములు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్‌లు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

పెనగలూరు : కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చినట్లు కిడ్నీ వ్యాధిగ్రస్తుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కడప జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఓబిలి గ్రామానికి చెందిన కనకదుర్గయ్య, పద్మ దంపతుల కుమారుడు, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు భానుప్రసాద్‌తో కలిసి సీఎంను కలిశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి చికిత్సకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి వద్దకు తమను తీసుకెళ్లిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, తిప్పన నాగభూషణంలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమే

రామాపురం : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తు ప్రతి ఉపాధ్యాయునికి బదిలీ సహజమేనని ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రలు అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లెలోని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు జి.సి వెంకటసుబ్బయ్యకు ఏర్పాటు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుడు, ఆయన సతీమణికి ఎంఈఓలు, ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, మల్లిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, రాజారెడ్డి, జయరాంరెడ్డి, ఫాల్గునరెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

'సీడ్' నిధులను విడుదల చేయాలి

లక్కిరెడ్డిపల్లె : సంచార జాతుల అభివృద్ధికి కేంద్రం కేటాయించే సీడ్ నిధులను వెంటనే విడుదల చేయాలని సంచార జాతుల, దొమ్మర కుల సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతులు ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం డీఎన్‌టీ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటి వరకు కూడా సంచార జాతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎన్‌టీ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా సంచార జాతుల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన సీడ్ పథకంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులకు రుణాలు ఇవ్వకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం స్పందించి సీడ్ సంక్షేమ పథకం ద్వారా సంచార జాతుల వారిని ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో రాయదుర్గం హరికృష్ణ, రాయదుర్గం రాజశేఖర్, రాయదుర్గం గుర్రప్ప, మహిళా అధ్యక్షురాలు ఆర్ ఉమాదేవి పాల్గొన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు జరిపారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు రాహుకాల పూజల విశేషాలను అర్చకులు వివరించారు.

భద్రకాళికి పంచామృతాభిషేకం

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కుంకుమార్చన, మంగళహారతి, తీర్థప్రసాదాల వినియోగం చేశారు. అనంతరం భద్రకాళి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

గిరిజన మహాసభలను జయప్రదం చేయండి


కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె: రాయచోటి పట్టణంలో 30వ తేది నుండి నాలుగురోజులపాటు గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఏఐటీయుసీ రాష్ట్ర నాయకులు పోకూరు మురళీలు కోరారు. శుక్రవారం వారు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగంపేటలో పంపిణీ చేశారు. మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, సిపిఐ రైల్వేకోడూరు మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ కోడూరు ఏరియా అధ్యక్షులు మోడి శివయ్య, మహిళా సమాఖ్య మండలి కార్యదర్శి వంపన నరసమ్మ, సిపిఐ నాయకులు మడగలం రోశమ్మ, జ్యోతి రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సేవలను అందిస్తున్నారన్నారు. వలంటీర్లు సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సమాజంలో అందరితో శెభాష్ అనిపించుకుంటున్నారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని పవన్‌కల్యాణ్ వలంటీర్లపై విషం కక్కుతున్నాడని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆలోచన అన్నారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జగనన్న సురక్ష పరిశీలకులు మునిశంకరయ్య, జేసీఎస్ మున్సిపాలిటీ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, సత్యాల మౌనిక, సింధూరి, సనిశెట్టి నవీన్‌కుమార్, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మోములో చిరునవ్వే లక్ష్యం

చిన్నమండెం : రాష్ట్ర ప్రజల మోములో చిరునవ్వే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన సాగుతున్నదని సర్పంచ్ లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లె, మల్లూరు గ్రామ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రకాల సర్టిఫికెట్లను 520 మందికి పంపిణీ చేశారు. మల్లూరు సర్పంచ్ నజీర్, తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీటీసీ శ్యామ్‌చంద్ర, మండల జేసీఎస్ ఇంచార్జ్ చుక్కా అంజనప్ప, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శంకరయ్య, ఉపసర్పంచ్ పెద్దరెడ్డప్పరెడ్డి, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని గాదెల పంచాయతీలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న తహసీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటిని సర్వే చేసి సంక్షేమ పథకాలు అందని ప్రజలను గుర్తించి సంక్షేమ పథకాలను అందించడంతోపాటు 11 రకాల సేవలను అందజేస్తారన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ రామకృష్ణయ్యతో కలసి తహసీల్దార్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. స్థానిక సర్పంచ్ కృష్ణయ్య, వై.ఉమాశంకర్ రెడ్డి, జెబ్బిరెడ్డి మనోహర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ అమరేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్ : పేదవాడి సంక్షేమమే జగనన్న ప్రభుత్వలక్ష్యం అని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు, మైసూరువారిపల్లెలలో జరిగిన జగనన్న సురక్షలో ఆయన హాజరై మాట్లాడారు. అందరికీ సంక్షేమం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తారతమ్యాన్ని ప్రజలు గమనించాలన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ జాషువా, ఉర్లగట్టుపోడు సర్పంచ్ గోపి, మైసూరువారిపల్లె సర్పంచ్ సంయుక్త, ఎంపీటీసీ రాజా, మాజీ సర్పంచ్ ఓబులరెడ్డి, దమ్ము రఘు తదితరులు పాల్గొన్నారు.

11 రకాల సేవలను అందించడమే జగనన్న సురక్ష

సిద్దవటం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి , నిజమైన అర్హులకు న్యాయం జరిగే విధంగా 11 రకాల సేవలను ఉచితంగా అందిచండమే జగనన్న సురక్ష అని ఎంపీడీఓ జవహర్‌బాబు అన్నారు. మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు, కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, మరికొన్ని వాటిని ఎంపీపీ వెంకటమ్మ, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మిదేవి, ఉచితంగా అందజేశారు.

సాంకేతికతతో వ్యవసాయం సులభం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

రాయచోటి టౌన్ : సాంకేతికతో వ్యవసాయం మరింత సులభతరంగా మారుతుందని రాయచోటి వ్యవసాయశాఖ అధికారి దివాకర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు, ఆర్‌బీకే సిబ్బందికి వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయంలో పంటలను రక్షించుకోవడానికి పురుగుల మందు పిచికారీ చేయడానికి, విత్తనాలు చల్లడానికి, ఎరువులు, నానో ఎరువులు చల్లడానికి ఉపయోగించవచ్చుని చెప్పారు. ఇలా డ్రోన్ ఉపయోగించడం వలన కూలీల ఖర్చు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. సాంకేతికతను జోడించి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి, మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు అవుతుందని దీనిని ఒక రైతు కొనుగోలు చేయలేరని చెప్పారు. అందుకోసం గ్రామాల్లో సీహెచ్‌సీ గ్రూపులు ఏర్పాటు అయితే అర్హతను బట్టి 40శాతం నుంచి 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు.

సబ్సిడీపై పిచికారీ డ్రోన్లు

గాలివీడు : వ్యవసాయంలో డ్రోన్ పద్ధతిలో పురుగుల మందులు పిచికారీ చేసుకునేందుకు పరికరాలను ప్రభుత్వం 40శాతం సబ్సిడీపై సీహెచ్‌సీ గ్రూపులకు అందిస్తోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి మురళీధర్‌తో కలిసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రోన్ పరికరం పూర్తి ధర రూ.10లక్షలు కాగా ప్రభుత్వం అందించే 40శాతం సబ్సిడీ రూ.4లక్షలు పోనూ మిగిలిన రూ.6లక్షలు గ్రూపు వాటా కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందులో తర్ఫీదు పొందేలా ఇంటర్మీడియట్ చదివిన యువకులకు డ్రోన్ పైలట్‌గా ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంప్రదించాలని అధికారులను తెలిపారు. సమావేశంలో ఉద్యానశాఖ అధికారిణి నాగమణి, శంకర్, మండలి సభ్యులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : సాంకేతిక విద్య వల్ల ఉపాధి అవకాశాలను మెండుగా అందిపుచ్చుకోవచ్చని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక న్యాక్ శిక్షణా కేంద్రంలో పీఎంకేఈవై పథకం కింద ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న అరవై మందికి శుక్రవారం జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిరుద్యోగ యువతకు సాంకేతిక విద్యలో శిక్షణ ఇచ్చి తద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా న్యాక్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇక్కడ న్యాక్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు ఈ సందర్భంగా ఆకేపాటి గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేలాది మంది ఈకేంద్రంలో శిక్షణ పొంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. అనంతరం ఆకేపాటి న్యాక్ కేంద్రంలో న్యాక్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ హరికృష్ణ, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ మేకల రాకేష్, న్యాక్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాలిశెట్టి శంకరయ్య, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సత్యాల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి తదితరులు పాల్గొన్నారు. అదే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ న్యాక్ కేంద్రానికి రూ.10 వేలు విలువ చేసే కూల్‌వాటర్ కమాండర్ మిషన్‌ను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, పోలా చేతుల మీదుగా అందజేశారు.



చేదోడు వాదోడుగా వలంటీర్లు


కోవిడ్ సమయంలో ఫింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

ఇతని పేరు కృష్ణప్రసాద్ వలంటీర్‌గా పుల్లంపేట మండలంలో సేవలు అందిస్తున్నాడు. తన పరిధిలో కుటుంబాలకు పిలిస్తే పలికే వ్యక్తిలా మారాడు. క్లస్టర్‌లోని కుటుంబాలు కృష్ణను తమ సొంత వ్యక్తిగా భావించేలా సేవ చేశాడు. వారికి ప్రభుత్వ పథకాల నుంచి ఇంటి పన్నులు, ఇతర సర్టిఫికెట్ల కోసం కృష్ణకు ఫోన్ చేస్తే చాలు అనేలా వారికి నమ్మకం కలిగించాడు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ కుటుంబాలకు ఎంతో చేదోడు వాదోడుగా ఉంటోంది. అంతకుముందు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. దీంతో అందరూ వలంటీర్ కృష్ణ సేవలను ప్రశంసిస్తున్నారు. – పుల్లంపేట

పెద్దకుమారుడిలా వలంటీర్ ఆదుకున్నాడు



ఉన్నఫలంగా లాక్‌డౌన్ పడి ఆర్థికంగా ఇబ్బందులు ఉండేవి. అయితే గారాలమడుగు వలంటీర్ హరిబాబు ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్‌తో పాటు ప్రభుత్వం ఇచ్చిన రూ. 1000లు నగదు అందజేసి పేదల కోసం జగనన్న ఇచ్చారని తెలిపారు. ఆ సమయంలో వలంటీర్లు చేసిన సేవలు మరువలేం. ఇలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎం.నరసయ్య, గారాలమడుగు, పుల్లంపేట

కుటుంబ సభ్యుడిలా సేవలు..


లబ్ధిదారుడుకి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ అంజలి శ్వేతాశ్రీ

ఈ చిత్రంలో కనిపిస్తున్న శ్వేతశ్రీ సిద్దవటంలోని గాంధీవీధిలో వలంటీర్‌గా సేవ చేస్తోంది. ప్రజాసేవ పట్ల ఎంతో మక్కువతో తాను వలంటీర్‌గా చేరినట్టు తెలిపింది. తనకు కేటాయించిన కుటుంబ సభ్యులకు ఏ అవసరమున్నా నిమిషాల్లో వారి కావాల్సిన సమాచారానికి సంబంధించిన వివరాలను అందించేది. కరోనా సమయంలో తన శక్తికి మించి విశేష సేవలను చేసింది. విపత్కర పరిస్థితులలో తన పరిధిలోని కుటుంబాలను తన సొంత కుటుంబ సభ్యుల వలే భావించి ప్రభుత్వం అందిరస్తున్న సంక్షేమాన్ని అందించి, సేవా గుణాన్ని చాటింది. దీంతో తన పరిధిలోని కుటుంబాలు శ్వేతను చూసి శభాష్ వలంటీర్ అంటూ అభినందించారు. – సిద్దవటం

వలంటీర్ శ్వేత సేవలు మరువలేను



తనకు గత ప్రభుత్వంలో పింఛన్ కోసం ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా పింఛన్ రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వచ్చాక వలంటీర్ వ్యవస్థ పెట్టడంతో మా వలంటీర్ అంజలి శ్వేతాశ్రీ నా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకొని ఆమె అర్జీ పెట్టి నాకు పింఛన్ వచ్చేలా చేసింది. కరోనా ఉన్నా ప్రతి నెల తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తుంది. ఆమె చేసిన సేవలను తాను మరువలేను. –భవనాశి పుల్లయ్య, గాంధీవీధి, సిద్దవటం

ధనకామాక్షి అలంకరణలో అమ్మవారు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు శివాలయం పక్కన ఉన్న కామాక్షి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించినట్లు పురోహితుడు సుబ్బనరసయ్య, ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డి, పూజారి రామలింగయ్య స్వాములు తెలిపారు. శ్రావణ శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.